PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 335 పేజీలు - 08 గురువారం 29 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి**




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...



## కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

**అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**

**ముందస్తు చర్యలు చేపడుతున్నాం.. కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం**

**అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం**

**విపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన కరువు పరిస్థితులను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎల్‌నినో మిగతా2లో...

## అప్రమత్తంగా ఉండండి..

**- తాగునీటి సమస్య రానివ్వొద్దు!**

**ఎల్‌నినో నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**క్యూర్ ఏరియాలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు వందశాతం పనిచేయాలి**

**భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి**

**శుద్ధి చేసిన నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి ఆదేశాల అమలు**



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వందశాతం సామర్థ్యంతో మిగతా2లో...

## ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

**- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 28:** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధారణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

## ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

**● నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్**

**● 7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు**



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. మిగతా2లో...

## ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సాంకేతికతను వినియోగించాలి: భట్టి విక్రమార్క**




2లో

## వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

**పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం**



2లో



## మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

**● ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్ ● ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు

మిగతా2లో...

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

**సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన**

**ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి**



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ నేత కార్తిక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

# అప్రమత్తంగా ఉండండి..

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వృథా చేయకుండా వివిధ అవసరాలకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. **భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వాడాలి**సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్తును వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుద్ధి కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. **శుద్ధి కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ**ప్రతి మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను గుర్తించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని పచ్చరంగు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. **సమీక్షలో ఉన్నతాధికారులు** ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. **కేంద్రానికి నివేదిక.. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం**రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తెలంగాణకు రావాల్సిన సహాయంపై కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు చేసిన సూచనలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలో చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని తెలిపారు.**తాగునీరు, పశువుల మేతకు ప్రాధాన్యం** దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఉండటంతో పాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురవడం వల్ల ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు తగ్గాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

(మొదటి పేజీ తరువాయి)

**రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు** కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు .**ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# 12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ
- వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు.హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు.మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝాను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.



# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

## - ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు.ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ.7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.**కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ.1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

# ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్యూమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం.**తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

# మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.**దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

- పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** అర్నాబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట నేలకొరగగా, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో పరిస్థితిని సమీక్షించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో పరిస్థితులను బట్టి సెలవులు ప్రకటించాలని అధికారులు ఆదేశించారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత పెంచి సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ తీగలు, పాత గోడలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. పంట నష్టానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 28 :** మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రభుత్వ పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రజల సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారులకు అవసరమైన సమాచారం సులభంగా అందడం వంటి ప్రయోజనాలు ప్రజలకు కలగాలని పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను ముందుగానే గుర్తించడం, అభివృద్ధి పనుల్లో జాప్యానికి కారణాలను విశ్లేషించడం వంటి అంశాల్లోనూ ఏఐని వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించిన సమాచారాన్ని అధికారికంగా వినియోగించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాల ఆధారంగా విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు.

# అంబేద్కర్ అభయ హస్తం పథకం ఎక్కడ?

- దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఎప్పుడు ఇస్తారు?
- బీఆర్ఎస్వీ చౌటుప్పల్ మున్సిపల్ నాయకుడు ఊదరి రాకేష్ మాదిగ డిమాండ్



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 28:** దళిత కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్వీ చౌటుప్పల్ మున్సిపల్ నాయకుడు ఊదరి రాకేష్ మాదిగ డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన దళిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి, వారి అభివృద్ధికి కృషి చేయాలని రాకేష్ మాదిగ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి పథకం అమలుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

# శాంతినగర్‌లో భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- అమ్మవారి ఒడిబియ్యంతో అన్నప్రసాద వితరణ
- వెల్ఫేర్ అసోసియేషన్, శాంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 28:** పట్టణంలోని శాంతినగర్‌లో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి ఉత్సవాల్లో భాగంగా శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, శాంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, వాటితో అన్నప్రసాదం తయారుచేసి భక్తులకు పంపిణీ చేశారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తుల్లో భక్తిభావాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దగోని రమేష్ గౌడ్, కోశాధికారి సురుగు రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బొంగు పండు గౌడ్, కాలనీ పెద్దలు, మహిళా భక్తులు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి చలమల్ల కృష్ణారెడ్డి ఆర్థిక సాయం

- నవీన్ కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థిక భరోసా



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 28:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కొండూరి నవీన్ కుటుంబానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.నవీన్ పిల్లల భవిష్యత్తుకు అండగా నిలిచే ఉద్దేశంతో చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందించారు. గ్రామ సర్పంచ్ అన్నం మల్లేష్ సైతం రూ.50 వేల సాయం చేయడంతో బాధిత కుటుంబానికి మొత్తం రూ.1.50 లక్షలు అందాయి. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన చలమల్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ మల్లేష్‌ను గ్రామస్థులు అభినందించారు.

# నీటి సంరక్షణకు సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ప్రత్యేక చొరవ

- ఎల్‌నినో ప్రభావంపై అంకిరెడ్డిగూడెంలో గ్రామసభ




**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 28:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలపై అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఆయన అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి, తాగునీరు, సాగునీటి సంరక్షణ, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం, ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనుల కల్పనపై చర్చించారు.గ్రామ ప్రజలు, రైతులు, మహిళలకు మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ఆర్.వి. సత్యనారాయణ, ఏపీఓ ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశాల్ రెడ్డి, పశువైద్య అధికారి శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ అధికారి వీణ, గ్రామ పాలకవర్గ సభ్యులు, రైతులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత గ్రామ అభివృద్ధికి పెద్ద మనసుతో ముందుకొచ్చిన చలమల్ల కృష్ణారెడ్డి!

- రూ.26 లక్షల సొంత నిధులతో రాజన్న బావి గూడెంలో రహదారి నిర్మాణం
- ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా..
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడి ముందడుగు



**తొలి అక్షరం/చౌటుప్పల్ అక్టోబర్ 28:** సొంత ఊరిపై మమకారం.. గ్రామ ప్రజలపై బాధ్యత.. అభివృద్ధి పట్ల అంకితభావం! ఈ లక్షణాలకు నిదర్శనంగా నిలుస్తున్నారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి. పదవులు, రాజకీయాలకే పరిమితం కాకుండా తన సొంత గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ఆయన ముందుకు రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.మండల పరధిలోని మల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని తన సొంత గ్రామమైన రాజన్న బావి గూడెం అభివృద్ధికి చలమల్ల కృష్ణారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఏకంగా రూ.26 లక్షల సొంత నిధులను వెచ్చించి రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.బుధవారం రాజన్న బావి గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, వారి ప్రయోజనాల కోసం వ్యక్తిగతంగా నిధులు ఖర్చు చేస్తూ అభివృద్ధికి బాటలు వేయడం ఆయనకు గ్రామంపై ఉన్న మమకారాన్ని, ప్రజల పట్ల ఉన్న బాధ్యతను చాటిచెబుతోంది.గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, తన వంతు బాధ్యతగా సొంత నిధులతో రహదారి నిర్మాణానికి ముందుకు రావడం చలమల్ల కృష్ణారెడ్డి ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వామి కావాలనే ఆయన ఆలోచన గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది.సొంత గ్రామం అభివృద్ధి చెందాలి.. ప్రజల కష్టాలు తీరాలి.. రాకపోకలు సులభతరం కావాలి అనే లక్ష్యంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సేవ పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతున్న చలమల్ల కృష్ణారెడ్డి చొరవను స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: ప్రొఫెసర్ పురుషోత్తం

**హైదరాబాద్, ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (తొలి అక్షరం):** మనిషికి ప్రాణవాయువు ఎలాగో సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు అలాగేనని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాత్రికేయులను సన్మానించారు. జర్నలిస్టులు సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, నేడు వారి పరిస్థితి దయనీయంగా ఉందని పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా సంఘటితంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం, పదవీ విరమణ చేసిన పాత్రికేయులకు జాతీయ పింఛను పథకం, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం ఐఎఫ్‌డబ్ల్యూజే పోరాడుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేసి జర్నలిస్టుల సమస్యలపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు టి. ఉడయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామకుమార్, సిబి లక్ష్మి, యర్రమిల్లి రామారావు తదితరులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ మండలి సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# ఏన్కూరులో రోడ్డు పనులపై నిర్లక్ష్యపు నీడ!

- వర్షంలో పనులు.. బురదలో ప్రయాణాలు!
- హెచ్చరిక బోర్డులు ఏవీ? అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?



**తొలి అక్షరం/ ఏన్కూర్ అక్టోబర్ 28:** ప్రజల ప్రయాణానికి భరోసా ఇవ్వాల్సిన రోడ్డు పనులే ప్రమాదాలకు కారణమవుతున్నాయా? వర్షం పడుతున్నా పనులు కొనసాగుతున్నాయి.. రోడ్డంతా బురదమయంగా మారుతోంది.. వాహనదారులు మాత్రం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి! ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని ఏన్కూరు మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనుల నిర్వహణ తీరుపై స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.వర్షపు పరిస్థితుల్లో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో రహదారిపై బురద ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అవసరమైన హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. **ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?** రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం అభివృద్ధికి సంకేతమే అయినప్పటికీ, ఆ పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. వర్షం పడుతున్న సమయంలో రహదారి పరిస్థితిని అంచనా వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పనులు జరుగుతున్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులకు ముందస్తు సమాచారం అందించాలి. ప్రత్యామ్నాయ మార్గాలు అవసరమైతే వాటిని సూచించాలి.అయితే, ఏన్కూరు మండల కేంద్రంలో రోడ్డు పనుల వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు,




కాంట్రాక్టు సిబ్బంది పర్యవేక్షణ తగిన స్థాయిలో ఉందా? పనులు నిర్వహించే సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అభివృద్ధి పనుల పేరుతో ప్రజల భద్రతను విస్మరించకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు పనులు పూర్తయ్యాక సౌకర్యాలు కలగాలి కానీ, పనులు జరుగుతున్న సమయంలోనే ప్రమాద భయం వెంటాడే పరిస్థితి ఉండకూడదని కోరుతున్నారు. **అధికారులు ఇప్పటికైనా స్పందించేనా?** రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వర్షపు పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు, సమీక్షలు నిర్వహించడం కంటే.. ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. ఏన్కూరులో రోడ్డు పనుల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తారా? లేక వాహనదారుల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.

# అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యం

**- ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమస్యలను పరిష్కరించాలి: ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ దేవసేన**

**తొలి అక్షరం, ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28:** అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన అన్నారు. బుధవారం కూసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌తో కలిసి ఎన్నికల నమోదు అధికారులతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేవసేన మాట్లాడుతూ, ఓటరు జాబితా రూపకల్పన ఎన్నికల ప్రక్రియలో కీలకమని పేర్కొన్నారు. ఫారం-6, 6ఏ, 7, 8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి క్షేత్రస్థాయిలో గుర్తించిన మార్పులను జాబితాలో నమోదు చేయాలని ఆదేశించారు. అధికంగా ఓటర్ల చేర్పులు, తొలగింపులు జరిగిన పోలింగ్ కేంద్రాలను పునఃపరిశీలించాలని, నోటీసులు, విచారణ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. యువ ఓటర్ల నమోదు, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ 99.99 శాతం పూర్తయిందన్నారు. జిల్లాలో 11,596 మంది యువ ఓటర్లు, 9,111 మంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 23,588 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు వివరించారు. కొత్తగా 19 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,479కు చేరిందన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం-6 దరఖాస్తులు 2,042, ఫారం-6ఏ దరఖాస్తులు 41, ఫారం-7 దరఖాస్తులు 153, ఫారం-8 దరఖాస్తులు 1,936 కలిపి మొత్తం 4,172 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విదేశాల్లో నివసించే భారతీయుల నుంచి 53 దరఖాస్తులు అందాయని, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.







# జర్నలిస్టు కుటుంబానికి పెద్దవంగర ప్రెస్ క్లబ్ అండ

**• రూ.1.77 లక్షల ఆర్థిక సాయం అందజేత**





**పెద్దవంగర, అక్టోబర్ 28 (తొలి అక్షరం):** మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన జర్నలిస్టు చింతల ఐలయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తోటి జర్నలిస్టులు, గ్రామస్థులు, మిత్రులు కలిసి రూ.1.77 లక్షల ఆర్థిక సాయం అందించారు. స్థానిక సర్పంచ్ పాయిలి యాకలక్ష్మి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఈ సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా డీపీఆర్ఓ పి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మరణించిన జర్నలిస్టు కుటుంబానికి గ్రామస్థులు, మిత్రులు, జర్నలిస్టులు ఐక్యంగా అండగా నిలవడం అభినందనీయమన్నారు. సమాజ అభివృద్ధికి ఉపయోగపడే విలువలతో కూడిన వార్తలను ప్రజలకు అందించాలని జర్నలిస్టులకు సూచించారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు. బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ రూ.46 వేలు, ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ రూ.10,500, పదో తరగతి 200708 బ్యాచ్ మిత్రులు రూ.36 వేలు, గంట్లకుంట సూపర్ కింగ్స్ వాట్సాప్ గ్రూప్ రూ.22,500, పెద్దవంగర ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు రూ.38,500, ఏడో తరగతి మిత్రులు రూ.23,700 అందించారు. కార్యక్రమంలో పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుమ్మరి రామ్మూర్తి యాదవ్, గౌరవ అధ్యక్షుడు గుల్లపెల్లి సదానందం, సీనియర్ జర్నలిస్టులు, తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు పానుగోత్ బాలాజీ నాయక్, ఇతర జర్నలిస్టులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సైదాపూర్‌లో రైతులతో వ్యవసాయ విద్యార్థుల ముఖాముఖి

**రైతుల సమస్యలు, అవసరాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం**

**గ్రామంలోని వ్యవసాయ వనరులు, సాగునీటి సదుపాయాల పరిశీలన**

**రైతుల అభిప్రాయాలు సేకరించి గ్రామీణ పరిస్థితులపై అవగాహన**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 28:** కరీంనగర్ జిల్లా, సైదాపూర్ మండలంలోని సైదాపూర్ గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు భాగస్వామ్య గ్రామీణ మదింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా చర్చించి, పంటల సాగు, సాగునీటి సదుపాయాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాలు, చీడపీడలు, గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ సదుపాయాలపై వివరాలు సేకరించారు. పశుపోషణ, పశువైద్య సేవలు, విద్యుత్ సరఫరా, రహదారులు, ప్రభుత్వ వ్యవసాయ పథకాల గురించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామంలోని భూమి, నీటి వనరులు, వ్యవసాయ వనరులను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు గల కారణాలు, సాధ్యమైన పరిష్కార మార్గాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామీణ జీవన విధానం, రైతుల సాగు పద్ధతులు, వ్యవసాయ సమస్యలపై ప్రత్యక్ష అనుభవాన్ని సంపాదించారు. కార్యక్రమంలో చిలుముల దీరజ్, యశ్వంత్, అవినాష్, శశాంక్, గిరీష్, విష్ణు, చంద్రవంశీ, వీరనారాయణ, అఖిల్, నవీన్ పాల్గొన్నారు.






# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్- నినో ప్రభావం పై రైతులకు అవగాహన సదస్సు

**- చంద్రుగొండ సర్పంచ్ బక్కి కవిత -అశోక్.**

**తొలి అక్షరం/నెక్కొండ అక్టోబర్ 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చంద్రుగొండ గ్రామంలో గ్రామ సర్పంచ్ బక్కి కవిత అధ్యక్షతన వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వ్యవసాయ భూములు ను కాపాడుట మరియు ఎల్ నినో ప్రభావం - రైతులు సాగు చేయాల్సిన యాసంగి పంటలు గూర్చి అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగింది , ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ . నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత ఎల్నినో ప్రభావం , భూగర్భ జలాల తరుగుదల వలన యాసంగి వరి పంట ను తగ్గించుకోవాలి అని, వరికి ప్రత్యామ్నాయ పంటలుగా కేవలం 2-3 తడులతో పండించు శనగ, వేరుశనగ, నువ్వులు, పెసర , మినుములు, జనుములు జొన్న, ఆముదం మరియు కూరగాయలు వంటి పంటలు ను రైతులు సాగు చెయ్యాలని, ఇట్టి పంటల ను రైతులు యాసంగి లో సాగు చేయుట ద్వారా కేవలం 2-3 నీటి తడులతో తక్కువ సమయంలో 100-110 రోజుల్లో మంచి ఆదాయం పొందవచ్చని, మరియు వరి పంట కు ఉపయోగించే నీటి లో కేవలం 10 శాతం నీరు ఇట్టి పంటల కు సరిపడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఇవో కె.నవీన్ రైతులు యాలాద్రి, సాంబయ్య, బసవయ్య, రాజు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# ఘనంగా టీడబ్ల్యూజేఎఫ్ 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**- జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ఐఎఫ్‌డబ్ల్యూజే నిరంతర పోరాటం**






**తొలి అక్షరం, ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28:** రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపు మేరకు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐఎఫ్‌డబ్ల్యూజే నిరంతరం పోరాడుతోందని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ తెలిపారు. ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో వేడుకలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేశారు. అనాథలకు, పేదలకు పండ్లు పంపిణీ చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నానబాల రామకృష్ణ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల సాధన, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు, పింఛన్లు, అక్రిడిటేషన్ కార్డుల వంటి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి స్వేచ్ఛ పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు, జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, వీడియో గ్రాఫర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ నాయక్, సీతామహాలక్ష్మి ఆశీస్సులు పొందిన మాజీ ఎంపీటీసీ బత్తిని అనిల్ గౌడ్



**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 28:** మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు: మాజీ ఎంపీటీసీ, నెల్లికుదురు ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బత్తిని అనిల్ గౌడ్ జన్మదినం సందర్భంగా తొర్రూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భార్యాపిల్లలతో కలిసి ఊకల్‌లోని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, సీతామహాలక్ష్మి దంపతులను కలుసుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ, వారి ఆప్యాయత, ఆశీస్సులు తనకు ఎంతో సంతోషాన్నిచ్చాయని తెలిపారు.

# పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 28:** రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులందరూ ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందరూ పట్టభద్రులందరినీ ఓటు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులను, ఉద్యోగులను, యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బందెల రాములు, పోషబోయిన మల్లేశం, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, సర్పంచ్ గొలుసుల సత్తయ్య, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, ముక్కామల దుర్గయ్య, ఎస్.కె చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు పులిపలుపుల వీరస్వామి, బత్తుల వెంకన్న, కోనూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్ రెడ్డి, మంటి లింగస్వామి, రాస వెంకటేశ్వర్లు, మామిళ్ళ కుమార్, తాళ్ల క్రాంతి కుమార్, చొప్పరి నరసింహ, ఆవుల శ్రీధర్, గుండాల రాంబాబు, రవ్వ నరసింహ, ఎండి అజాజ్, నోముల యాదయ్య, చినపాక రమేష్, దడిపల్లి మహేష్, పిట్ట మహేందర్ రెడ్డి, ఎడ్ల సురేష్, బాసాని రాజు, నోముల సైదులు, భరత్, రమేష్, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కోత దశలో నేల వాలిన వరి పంట



**తొలి అక్షరం/ దంతాలపల్లి అక్టోబర్ 28:** దంతాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నిన్నటి నుంచి వస్తున్న ఈదురూ గాలులకు వరి పంట నెల వాలింది కోత దశలో అకాలంగా ఇచ్చిన గాలుల కారణంగా పంట మొత్తం కింద పడింది అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు మొన్నటి వరకు వర్షాలు లేక ఇబ్బందులు పడ్డామని ఇప్పుడు గాలులతో నష్టం జరిగిందని వ్యక్తం చెందారు ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు

# వార్డు సభ్యుడు మేరుగు విజయ్ గౌడ్‌ను పరామర్శించిన సర్పంచ్ హరిప్రసాద్



తొలి అక్షరం/ నెక్కొండ అక్టోబర్ 28:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ ఒకటో వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు మేరుగు విజయ్ గౌడ్‌ను నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, ఈదునూరి సాయి కృష్ణ, రావుల మధుకర్ రెడ్డి, కొనిశెట్టి బిక్షపతి, నేతుల సారంగపాణి యాదవ్, తాళ్లపెల్లి భాస్కర్ గౌడ్, వనం ఏకాంతం, టైలర్ యాకూబ్, సోను పాషా, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రెమడాల గంగమ్మ మృతి చాలా బాధాకరం

**- నాతి. పరశురాములు గౌడ్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కుంకుడు పాముల**




తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 29: రామన్నపేట మండలం కుంకుడు పాముల గ్రామానికి చెందిన రెమడాల గంగమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాతి పరశురాముల గౌడ్, గంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల శ్రీనివాస్ రెడ్డి కన్నెబోయిన లచ్చయ్య గడ్డం మల్లేష్ చిల్లర సైదులు నాతి రవి కడారి మల్లేష్ మిట్ట కడుపుల రవి తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ సభ్యులు మేరుగు విజయ్‌ని పరామర్శించిన జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, సోసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి



తొలి అక్షరం/నెక్కొండ అక్టోబర్ 28: వరంగల్ జిల్లా నెక్కొండ మేజర్ గ్రామ 1వ, వార్డ్ సభ్యులు మేరుగు విజయ్ కి గుండె కి స్టంట్ పడగా హాస్పిటల్ నుండి డీఛార్జ్ అయి వారి నివాసానికి రాగ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వారిని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, నెక్కొండ సోసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శిరాచకొండ రఘునాథ్,మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అన్వర్,సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, ఎస్ సిక్స్ న్యూస్ రిపోర్టర్ పలుసం పూర్ణ చందర్, వ్యాపారస్తులు కొల్లు హరిప్రసాద్,రావు కొల్లి రామచంద్ర రెడ్డి,రావుల భాస్కర్ రెడ్డి, గంధం సుధాకర్,ధర్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ సీఐ సతీష్ రెడ్డిని

# కలిసిన కాంగ్రెస్ నాయకులు

**- శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**



తొలి అక్షరం /చౌటుప్పల్. అక్టోబర్ 28: చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ రెడ్డిని చౌటుప్పల్ మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉడుగు శ్రీనివాస్ గౌడ్, చౌటుప్పల్ కోఆప్షన్ సభ్యులు వస్తాం గంగా రాములు, మునుకుట్ల సత్యనారాయణ గౌడ్, ఎస్సై యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# హిమాంనగర్ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ

తొలి అక్షరం/ ఏన్కూర్ అక్టోబర్ 28: ఏన్కూరు మండలంలోని ఎంపీపీ ఎస్ హిమాం నగర్ పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ ముజాహిద్ బుధ వారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, భోజనం రుచిగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వంట సిబ్బందిని అభినందించారు.అనంతరం విద్యార్థులతో సరదాగా ముచ్చటిస్తూ వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా స్పెషల్ ఆఫీసర్ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దివ్య ఉపాధ్యాయురాలు శైలజ పాల్గొన్నారు.



# డాన్ బోస్కో పాఠశాలలో బాలల సైబర్ భద్రతపై న్యాయ అవగాహన

**• 400 మంది విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన**




తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 28: జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు సురక్షిత్ బచ్‌పన్ అభియాన్‌లో భాగంగా రామన్నపేటలోని డాన్ బోస్కో ఉన్నత పాఠశాలలో "సురక్షిత క్లిక్ సురక్షిత బాల్యం" అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి సుమారు 400 మంది విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎదురయ్యే ప్రమాదాలు, సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార పరిరక్షణ, బాలల హక్కుల గురించి వివరించారు. అపరిచితులతో ఆన్‌లైన్‌లో మాట్లాడకూడదని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, సంకేతపదాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ఆన్‌లైన్ వేధింపులు లేదా బెదిరింపులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేసి, అవసరమైతే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది కూనూరు శ్రీనివాస్, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్త కుర్మటి యాదయ్య, కె. శ్రీశైలం, పాఠశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, అకాడమిక్ డైరెక్టర్ పి. జనార్దనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. తుఫాన్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు నష్టం కలగకుండా చూడాలని ఆదేశించారు.

# దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరం






తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 28: జడ్పీహెచ్‌ఎస్ వెల్లంకి ప్రభుత్వ పాఠశాలలకు దివిస్ లేబరేటరీ అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట మండలం వెల్లంకి గ్రామ సర్పంచి ఈడం రాధ సూచించారు. వెల్లంకి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివిస్ లేబరేటరీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు దివిస్ సమకూర్చిన రూ 2, 27, 766 విలువగల నోటు పుస్తకాలు, టానికులు, ఔషధాలను సర్పంచి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి వార్డు సభ్యులు లింగయ్య, గ్రామ పెద్ద ఇడం శ్రీనివాసులు, వైద్యాధికారి నరేష్, దివిస్ ప్రతినిధులు బి. గోపి, జి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై మునిపంపులలో ప్రత్యేక గ్రామసభ

**- నీటిని పొదుపుగా వాడాలి: సర్పంచ్ బొడ్డుపల్లి వెంకన్న**




తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 28:మునిపంపుల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక గ్రామసభను సర్పంచ్ బొడ్డుపల్లి వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని, తాగునీటి కొరత, పంటల దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలంతా నీటిని పొదుపుగా వినియోగించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతి, ఎంపీవో ఎం.డి. రఫీ, డీటీ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాఘవ, ఏపీఓ వెంకన్న, ఏఈఓ వెంకన్న, గ్రామపంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థాయి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు




తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 28: నల్లగొండఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని, ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. పట్టభద్రులను కలిసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, మండల కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, మహమ్మద్ అక్రమ్, మోటి మహేష్, మహమ్మద్ రిజ్వాన్, మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గును కరువు మండలంగా ప్రకటించాలి

**- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ యువజన నాయకుడు పవన్ కల్యాణ్**



తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:కొందుర్గు మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ గంగన్నగూడ యూత్ ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. మండలంలో పంట నష్టంపై ప్రత్యేక అధికారుల బృందంతో సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన రైతులకు ఎకరాకు తగిన పరిహారం అందించాలని కోరారు. నిలిచిపోయిన రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అందక రైతులు కొత్త రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ యువజన విభాగం తరఫున పోరాటం కొనసాగిస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## వాసవి సేవాదళ్ రాష్ట్ర కోశాధికారిగా బెజుగం రమేష్



తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 28: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అనుబంధ విభాగమైన వాసవి సేవాదళ్ రాష్ట్ర కోశాధికారిగా షాద్‌నగర్‌కు చెందిన బెజుగం రమేష్ ఎన్నికయ్యారు. 20262028 కాలానికి ఆయనను ఈ పదవిలో నియమిస్తూ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... ఆర్యవైశ్య మహాసభ చేపట్టే సేవా కార్యక్రమాలకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేష్, రాష్ట్ర నాయకుడు దండు శరత్ చంద్రబాబు రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘాల నాయకులు యంసాని శ్రీనివాస్, తాటి రామ్మూర్తి, కట్ట పుల్లయ్య, గుబ్బ చంద్రశేఖర్, నాగిళ్ల ప్రభాకర్, కట్ట ప్రవీణ్, దండు రామ్మోహన్, గార్లపాటి నవీన్, గుబ్బ సురేష్ కుమార్, కల్వ మాణిక్యం, బందారు ఆనంద్, పెనుగొండ అశోక్, రామచంద్రుడు, ఎంబీఏ సురేష్, గందె రాజు, వేముల భరత్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలి

**- అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: షేక్ షావలి**



**తొలి అక్షరం/జవహర్ నగర్, అక్టోబర్ 28:** అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం, యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, ముఖ్యంగా ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచాలని, దోమలు, దుర్వాసన, కలుషిత నీటి సమస్యల నివారణకు బ్లీచింగ్ వంటి చర్యలు వేగవంతం చేయాలని కోరారు. యాప్రాల్, జవహర్ నగర్, నాగారం, ధమ్మాయిగూడ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై చెత్త రవాణా లారీల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడే కలుషిత ద్రవ వ్యర్థాల వల్ల ప్రజారోగ్యానికి ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున, డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లోనూ ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని షేక్ షావలి కోరారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వం, రాంకీ యాజమాన్యం బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# 20వ వార్డులో వీధి కుక్కల నియంత్రణ చర్యలు

- **కుక్కల బెడద నివారణకు కౌన్సిలర్ పినమోని గోపాల్ చొరవ**
- **మున్సిపల్ సిబ్బంది సహకారంతో వీధి కుక్కల తరలింపు**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** షాద్‌నగర్ పట్టణంలోని 20వ వార్డులో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టారు. వార్డు కౌన్సిలర్ పినమోని గోపాల్ చొరవతో మున్సిపల్ సిబ్బంది సహకారంతో కాలనీలో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టించి తరలించారు. వీధి కుక్కల సంచారంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీల్లో వీధి కుక్కల వల్ల చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ మున్సిపల్ సిబ్బంది సహకారంతో అవసరమైన చర్యలు కొనసాగిస్తామని కౌన్సిలర్ గోపాల్ పేర్కొన్నారు. వీధి కుక్కల సమస్య ఉన్న ప్రాంతాల ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# కరువు మండలాల జాబితాలో నందిగామ, కొందుర్గుకు చోటేదీ?

**- రైతుల సమస్యలను పట్టించుకోవాలి: బీఆర్ఎస్ యువ నాయకుడు జెట్ట నగేష్**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 2026 ఖరీఫ్ కరువు మండలాల జాబితాలో నందిగామ, కొందుర్గు మండలాలకు చోటు కల్పించకపోవడంపై బీఆర్ఎస్ యువ నాయకుడు జెట్ట నగేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ప్రభుత్వం, నందిగామ, కొందుర్గును ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రెండు మండలాల్లో పంట నష్టం, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్నట్లయితే కరువు మండలాల జాబితాలో చేర్చి, నష్టపోయిన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# కరువు మండలాల గుర్తింపుపై హర్షం

- **రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** 2026 ఖరీఫ్ కరువు మండలాల జాబితాలో జిల్లెడు చౌదరిగూడ మండలానికి చోటు కల్పించడంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టిన రైతులు ఆశించిన దిగుబడులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించడం రైతులకు కొంత ఊరటనిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

# బియ్యం పంపిణీలో జాప్యం చేస్తే కఠిన చర్యలు

**ఎంఎల్ఎస్ పాయింట్లపై ఆకస్మిక తనిఖీలు**

**బియ్యం నిల్వల వివరాలు రోజూ నవీకరించాలి: అదనపు కలెక్టర్**



**తొలి అక్షరం/రంగారెడ్డి, అక్టోబర్ 28 :** రంగారెడ్డి జిల్లా: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం తరలింపును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, రేషన్ దుకాణాలకు సకాలంలో సరఫరా చేయాలన్నారు. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లో రోజువారీ బియ్యం నిల్వల వివరాలను తప్పనిసరిగా నవీకరించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో బియ్యానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. నిల్వలు, రికార్డుల మధ్య వ్యత్యాసాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అక్రమాలు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డీఎం సివిల్ సప్లయ్ ఎస్. స్వప్న, పి. రాము, ఏఎం (అకౌంట్స్), వివిధ ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు** • **నాగులపల్లిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లి గ్రామంలో హైదరాబాద్‌మహబూబ్‌నగర్‌రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన, ఎన్నికల ఇన్‌చార్జి బైకని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. యువతకు ఉపాధి, విద్యుత్‌తోపాటు వివిధ రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మేలు చేసిందని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, స్థానిక సర్పంచ్ రాధిక అశోక్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలల రక్షణ, భద్రతపై విద్యార్థులకు అవగాహన

**బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా న్యాయమూర్తి పి. నారాయణ బాబు**







**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా వరంగల్ జిల్లా మామునూరులోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థలో బాలల రక్షణ, భద్రతపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయమూర్తి, సహకార ట్రిబ్యునల్ చైర్మన్ పి. నారాయణ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ బాబు మాట్లాడుతూ, బాలల హక్కులను పరిరక్షించడం, వారిపై జరిగే నేరాలను అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. వేధింపులు, బెదిరింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. కందుకూరి పూజ మాట్లాడుతూ, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం2012, బాలల హక్కులు, న్యాయ సహాయం గురించి వివరించారు. బాల్యవివాహాలు, అక్రమ రవాణా, వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని, బాధితులు అవసరమైన న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. మహిళలు, బాలల అక్రమ రవాణా నిరోధక విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు మాట్లాడుతూ, అపరిచితుల ప్రలోభాలకు లోనుకాకూడదని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ న్యాయవాది పి. శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, మామునూరు సబ్ ఇన్‌స్పెక్టర్ హరి శంకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, షీ టీమ్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఓం శివశక్తి పరిశ్రమ కాలుష్యంపై గ్రామస్తుల ధర్నా

**చెరువుల్లోకి వ్యర్థ జలాలు.. పంటలపై పొగ ప్రభావం**

**పరిశ్రమ మూసివేసే వరకు పోరాటం: కందివనం గ్రామస్తులు**





**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 28:** ఫరూక్‌నగర్ కందివనం పరిధిలోని ఓం శివశక్తి పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం పరిశ్రమ ఎదుట టెంట్ వేసి ధర్నా నిర్వహించారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు సమీప చెరువులో కలుస్తున్నాయని, దట్టమైన పొగ, ధూళి పంట పొలాలను కమ్ముకుంటున్నాయని ఆరోపించారు. కందివనంతో పాటు చౌలపల్లి, గుండెగాని తండా, పిట్టలగడ్డ తండా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని, పంటలకు నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. పలుమార్లు సమస్యను తెలియజేసినా పరిశ్రమ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాలుష్యాన్ని నియంత్రించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో పరిశ్రమ మూసివేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. అవసరమైతే పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో సర్పంచ్ జెమిని అమ్రు నాయక్, ఉపసర్పంచ్ విజయ యాదగిరి, మాజీ సర్పంచ్ శివజ్యోతి, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ఇళ్లల్లో పనిచేసేవారి వివరాలు నమోదు చేయాల్సిందే



- మల్కాజిగిరి సీపీ బి.సుమతి, ఐపీఎస్
- ఘనంగా మీ సురక్ష 2.0 కార్యక్రమ ప్రారంభం
- బేగంపేటలో అపార్ట్‌మెంట్ వాసులకు పోలీసుల హెచ్చరికతో కూడిన భరోసా
- నేరాల కట్టడే లక్ష్యంగా సరికొత్త ప్రత్యేక అప్లికేషన్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్28:** ఇళ్లల్లో పనిచేసే పనిమనుషులు, డ్రైవర్లు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డుల గుట్టు ముట్టూ పోలీసులకు తెలవాల్సిందేనని, అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం ఇస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి,ఐపీఎస్ తీవ్రంగా హెచ్చరిం చారు. నగరంలో నివాస ప్రాంతాల భద్రతను మరింత ఉక్కులా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ సురక్ష 2.0 కార్యక్రమాన్ని సోమవారం బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మయూర్ మార్గ్, మయూర్ అపార్ట్‌మెంట్స్‌లో ఆమె అధికారికంగా ప్రారంభించారు. ఇళ్లల్లో పనుల పేరుతో వచ్చి చోరీలు చేసే ఘరానా దొంగల ఆట కట్టించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సీపీ స్పష్టం చేశారు. **మీ సురక్ష 2.0 ప్రత్యేకతలు - సీపీ హెచ్చరికలు:** తప్పనిసరి నమోదు: ప్రతి కుటుంబం తమ ఇళ్లలో పనిచేస్తున్న గృహ సహాయకులు, వంటవారు, ధోబీలు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్ల పూర్తి వివరాలను బాధ్యతాయుతంగా పోలీసుల వద్ద నమోదు చేయించాలి. ఆన్‌లైన్ వెసులుబాటు: ప్రజల సౌలభ్యం కోసం మల్కాజిగిరి పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచిన మీ సురక్ష అప్లికేషన్ ద్వారా ఈ వివరాలను క్షణాల్లో రిజిస్టర్ చేసుకోవచ్చు. నేరాల కట్టడి: గృహ సహాయకుల గుర్తింపును సరిగ్గా ధృవీకరించుకోవడం ద్వారా అపార్ట్‌మెంట్లలో దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని తెలిపారు. ప్రజలదే బాధ్యత: కేవలం పోలీసుల భద్రత మాత్రమే కాకుండా, ప్రజల అప్రమత్తతతోనే శాంతిభద్రతలు సాధ్యమవుతాయని, ప్రతి నివాస సముదాయం ఈ భద్రతా నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. భద్రతా భరోసాతో పాటు పోలీసుల హెచ్చరికలను స్థానికులు తీవ్రంగా పరిగణించారు. మయూర్ మార్గ్, మయూర్ అపార్ట్‌మెంట్స్ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్,ఐపీఎస్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, ఎస్బీ డీసీపీ నరసింహారెడ్డి, బేగంపేట ఏసీపీ పి. గోపాలకృష్ణమూర్తి, ఇన్స్పెక్టర్ పి. సైదులు తదితర పోలీసు ఉన్నతాధి కారులు పాల్గొని భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.

# ఎలికట్ట వద్ద రోడ్డు పనులపై ఎమ్మెల్యే ఆగ్రహం

- నాలుగు లైన్ల రహదారికి ఆటంకాలు కలిగిస్తే సహించేది లేదు





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ సమీపంలో రహదారిపై చేపడుతున్న పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నాలుగు లైన్ల రహదారి నిర్మాణ ప్రతిపాదనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో, భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు కలిగించేలా పనులకు అనుమతులు ఎలా ఇచ్చారని ఆర్అండ్‌బీ అధికారులను ఫోన్‌లో ప్రశ్నించారు. రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉంటుందని తెలిసినా ముందుచూపు లేకుండా అనుమతులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని అధికారులను హెచ్చరించారు. అధికారులు స్పందించి పనులు ఆపకపోతే తానే రంగంలోకి దిగి నిలిపివేస్తానని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో ఎలికట్ట సమీపంలో జరుగుతున్న పనులపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ఆటంకాలు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారా? వివాదాస్పద పనులను నిలిపివేస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# షాద్‌నగర్ బడులకు మహర్దశ.. రూ.14.98 కోట్ల నిధులు

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే శంకర్ కృషి
- 90 అదనపు గదులు.. 38 మరుగుదొడ్ల మంజూరు



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.14.98 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. బుధవారం షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాబార్డు ద్వారా నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు 90 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయని తెలిపారు. ఫరూక్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ, కొత్తూరు, నందిగామ, కేశంపేట మండలాల్లోని పాఠశాలలకు నిధులు కేటాయించినట్లు వివరించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలకు 38 టాయిలెట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కమ్మదనం గురుకుల పాఠశాలకు రూ.10 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో వెలుగుల కోసం ఐమాక్స్ లైట్లను కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సంఘమిత్ర



- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్,ఐపీఎస్
- యువత భవితను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు
- నిర్మూలనలో మహిళలే సమాజానికి నిజమైన మిత్రులు
- పర్వతగిరిలో ఘనంగా సంఘమిత్ర కార్యక్రమం




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్28:** సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు మహిళలు యుద్ధం ప్రకటించాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్,ఐపీఎస్ పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు వరంగల్ ప్రాంతంలో మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు వేదిక వద్ద మంగళవారం డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ సంఘమిత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ..యువత సరదాగా ప్రారంభించి ఆ తర్వాత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ ఉజ్వల భవిష్యత్తును ఎలా నాశనం చేసుకుంటున్నారో పలు ఉదాహరణలతో వివరించారు. ఈ ప్రమాదం నుంచి యువతను కాపాడుకోవడంలో మహిళలు ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. సంఘమిత్ర అనగా సమాజానికి మిత్రులు. ప్రతి మహిళా కుటుంబంలో ఒక తల్లిగా, కుమార్తెగా, సోదరిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తుంటారు. ఇంట్లో ఎవరైనా మత్తు పదార్థాల బారిన పడితే వారి ప్రవర్తనను మహిళలు ఇట్టే గుర్తించి, సరైన దారిలో పెట్టగలరు అని డీసీపీ అంకిత్ కుమార్ పేర్కొన్నారు. తల్లిదండ్రుల నిఘా అవసరం: పిల్లల దైనందిన ప్రవర్తన, వారి స్నేహితుల వివరాలు, అలవాట్లను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. సమాచారం ఇస్తే గోప్యత: గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా గంజాయి సరఫరా లేదా విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు తెలపాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. అత్యవసర నంబర్: ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 112 నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమన్వయంతో ముందుకు: పోలీసులకు, సామాన్య ప్రజలకు, మహిళా సంఘాలకు మధ్య సమన్వయాన్ని పెంచి ఈ ప్రాంతాన్ని పూర్తిగా గంజాయి రహితంగా మారుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మామూనూరు ఎసిపి వెంకటేశ్వర్లు, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో పాటు గ్రామీణ మహిళలు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వివిధ ఎన్జీఓ ల ప్రతినిధులు సహా సుమారు 200 మంది వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌పరిగి రోడ్డులో కేబుల్ పనులు నిలిపివేత

- బంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు: స్వప్నలత
- రహదారి విస్తరణకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు



GOVERNMENT OF TELANGANA
ROADS & BUILDINGS DEPARTMENT

From
Smt. A.Swapna Latha M.Tech
Dy. Executive Engineer (R&B)
Shadnagar Sub-Division
Ranga Reddy District

TO
The M/S. Lakshmi Transco Private Limited
7-107/1/164, Macherla Nursing,
Hyderabad - 500072

Letter No.DEE /R&B/SDNR/Transco Pargi Road/2026-27/ Date:24-10-2026.

Sir,

Sub: (R&B) Dept - Shadnagar Sub-Division - Laying of 220 KV, 1200 Sq.mm underground cable from Shadnagar-Parigi Road from Km 4/200 to Km 7/00 - Deviation from authorized alignment and hindrance to proposed 4-lane road widening - IMMEDIATE STOP WORK ORDER & RE-ALIGNMENT NOTICE - Issued - Regarding.

Ref: Lr.No.EE/CD/DB/D1/Road Cutting/2025-26/, Dated: 14.10.2026 of the Executive Engineer, (R&B) Division, Chevella.

With reference to the subject cited above, your agency was permitted to carry out road cutting work for laying a 220 KV, 1200 Sq.mm underground cable along the Shadnagar-Parigi Road from Km 4/200 to Km 7/00, subject to the conditions stipulated in the reference letter.

During field inspection, it has been observed that your agency has commenced trench excavation work at a distance of just 1.0 meter away from the existing Bituminous (BT) road edge.

You are hereby informed that this specific road stretch is formally sanctioned for expansion from its existing 2-lane layout to a 4-lane configuration. Excavating 1.0 meter from the current BT edge places your high-voltage cable directly within the footprint of the proposed main carriageway of the upcoming 4-lane design. This alignment is a direct violation of Condition No. 4 (which mandates the utility be strictly located beyond the shoulder) and Condition No. 8 (which explicitly binds your agency to shift or re-locate the cable to clear future road widening works).

To safeguard the future 4-lane road expansion profile, you are hereby directed to STOP ALL DIGGING AND EXCAVATION WORK IMMEDIATELY and adhere to the following mandatory instructions:

1. Re-align the Cable Route: The entire cable trench line must be shifted outward and laid strictly at a minimum distance of 10.0 meters away from the existing center line of the road.
2. Joint Site Inspection: Depute your authorized senior project engineer to report to the office of the undersigned within 2 days of receipt of this letter for a joint site inspection to physically mark the revised 10-meter boundary line on the ground.
3. Safety Compliance: Barricade, backfill, and compact the existing open, hazardous trenches left exposed at the 1-meter mark immediately to prevent public safety hazards and traffic accidents, as per Condition No. 2 and 3.

Please take notice that as per Condition No. 10 of your permission letter, any deviation from the approved specifications automatically deems your permission cancelled. Failure to halt operations immediately and re-align the utility line at the mandatory 10.0-meter setback will result in the immediate revocation of your road cutting permission without further notice.

Yours faithfully,
Deputy Executive Engineer (R&B)
Shadnagar - Sub Division
Ranga Reddy District.



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** షాద్‌నగర్‌పరిగి ప్రధాన రహదారిపై 220 కేవీ భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆర్అండ్‌బీ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వప్నలత ఆదేశించారు. రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించినట్లు వెల్లడించారు. రహదారి అంచు నుంచి మీటరు దూరంలోనే తవ్వకాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో నాలుగు వరుసల రహదారి విస్తరణకు ఆటంకం కలిగే ప్రమాదముందని పేర్కొన్నారు. కేబుల్ మార్గాన్ని రహదారి మధ్య రేఖ నుంచి కనీసం పది మీటర్ల దూరానికి మార్చాలని సూచించారు. ఇప్పటికే తవ్విన గుంతలను పూడ్చివేసి, ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో సంబంధిత సంస్థ ప్రతినిధులు సంయుక్త పరిశీలనకు హాజరుకావాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకపోతే అనుమతులు రద్దు చేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

# పోలీసు సేవల్లో సాంకేతిక విప్లవం

**● సీఐడీలో ఏడు డిజిటల్ సేవలు ప్రారంభించిన డిజిపి సి. వి.ఆనంద్ ● పౌరుల అభిప్రాయాల సేకరణకు ప్రత్యేక కేంద్రం ● నేర పరిశోధనలో ఫేస్ రికగ్నిషన్, ఫింగర్‌ప్రింట్ యాప్‌లు ● భరోసా కేంద్రాల సేవలకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ● జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీలపై నిఘాకు వ్యవస్థ**







**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబరు28:** పోలీసు సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా, సమర్థంగా అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నేర పరిశోధన విభాగం (సీఐడీ) రూపొందించిన ఏడు డిజిటల్ సేవలను డిజిపి సి.వి.ఆనంద్ డిజిపి కార్యాలయంలో ప్రారంభించారు. **పౌరుల అభిప్రాయాల సేకరణకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్:** పోలీసు సేవలను ఇటీవల వినియోగించుకున్న ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేశారు. పిటిషన్లు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, ఈ-చలాన్లు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ సేవలపై ప్రజల స్పందనను ఈ కేంద్రం సేకరిస్తుంది. **భరోసా కేంద్రాలకు డిజిటల్ సేవలు:** మహిళా భద్రతా విభాగం రూపొందించిన 'భరోసా' సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవల వివరాలను నమోదు చేసి, కేసు ప్రారంభం నుంచి ముగింపు వరకు పర్యవేక్షించవచ్చు. కాగితపు రిజిస్టర్లకు బదులుగా రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, 23 రకాల నివేదికలు అందుబాటులో ఉంటాయి. **సీఐడీకి ప్రత్యేక వెబ్‌సైట్:** సీఐడీ కార్యకలాపాలు, సేవలకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు https://cid.tspolice.gov.in/ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. **విడుదలైన ఖైదీల నిఘా:** జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీల సమాచారాన్ని పోలీసులకు సకాలంలో చేరవేసేందుకు జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టమ్ (జేఆర్ఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్ఐసీకి చెందిన ఈ-ప్రిజన్స్ వ్యవస్థను సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించారు. ఖైదీల విడుదల వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లు, అధికారులకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడంతోపాటు రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణ, ఖైదీల వివరాల శోధనకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. నేర నెట్‌వర్క్‌లను గుర్తించేందుకు, ముందస్తు నిఘాను బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది. **15 సెకన్లలో ముఖ గుర్తింపు:** 9.8 లక్షలకు పైగా ఫొటోలతో రూపొందించిన మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్ ద్వారా సుమారు 15 సెకన్లలో ముఖాలను సరిపోల్చవచ్చు. అనుమానితులు, మృతులు, గుర్తుతెలియని మృతదేహాలు, తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడంలో ఇది ఉపయోగపడుతుంది. **ఫింగర్ ప్రింట్లతో వేగంగా ఆధారాల సేకరణ:** క్రైమ్ సీన్ ఛాన్స్ ప్రింట్ యాప్ ద్వారా నేరస్థలాల్లో లభించే వేలిముద్రలను ఆండ్రాయిడ్ ఫోన్లతోనే సేకరించి, వెంటనే రాష్ట్ర సర్వర్‌కు పంపవచ్చు. అక్కడ ఆటోమేటిక్‌గా సరిపోల్చడం ద్వారా అనుమానితులను గుర్తించేందుకు త్వరితగతిన ఆధారాలు లభిస్తాయి. దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. **దర్యాప్తు అధికారులకు మార్గదర్శకాలు:** నేర పరిశోధనలో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్‌ఓపీలు) రూపొందించారు. శారీరక నేరాలు, ఆస్తి నేరాలు, మహిళలు-పిల్లలపై నేరాలు, ప్రత్యేక-స్థానిక చట్టాలు, ఇతర నేరాలకు సంబంధించి వీటిలో మార్గదర్శకాలు ఉన్నాయి. దర్యాప్తు నాణ్యతను పెంచి, న్యాయస్థానాల్లో నేర నిరూపణ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఇవి దోహదపడనున్నాయి. ఈ డిజిటల్ సేవలతో పోలీసు వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ప్రామాణిక దర్యాప్తు విధానాల సమన్వయంతో నేర నియంత్రణ, పరిశోధనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిపి సి. వి. ఆనంద్ తో పాటు, డిజి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డిజి (సిఐడి) చారు సిన్హా, ఎడిజి అకన్ సబర్వాల్, ఐజి (పి అండ్ ఎల్) గజరావు భూపాల్, డిఐజిలు నారాయణ నాయక్, పరిమళ హన నూతన్ , ఎస్పీలు విశ్వజిత్ కంపాటి, రూపేష్, ప్రవీణ్ కుమార్, మల్లారెడ్డి , బాలకోటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్లపై రచ్చ చేస్తే.. ఊడ్చే శిక్ష తప్పదు

**- మేడిపల్లిలో ఆకతాయిల వీరంగం.. స్వచ్ఛభారత్ చేయించిన పోలీసులు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబర్28:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ, రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగించేలా న్యూసెన్స్‌కు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని మేడిపల్లి సీఐ డి.జలంధర్ రెడ్డి హెచ్చరించారు. పబ్లిక్ ప్లేస్‌లలో అల్లకల్లోలం సృష్టించి, ఇబ్బందులకు గురిచేసిన ఆకతాయిలపై తీసుకున్న చర్యలపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ వివరాలు వెల్లడిస్తూ..మేడిపల్లి పీఎస్ పరిధిలో వేర్వేరు తేదీల్లో న్యూసెన్స్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై తమ సిబ్బంది వెంటనే కేసులు నమోదు చేసి, పక్కా ఆధారాలతో కోర్టు ముందు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి..నిందితుల తీరును పరిగణలోకి తీసుకుని వినూత్న తీర్పునిచ్చారని సీఐ పేర్కొన్నారు. నిందితులు ముగ్గురూ గంటసేపు స్వచ్ఛభారత్ (పరిశుభ్రతా కార్యక్రమం) చేయవలసిందిగా జడ్జి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించినా, చట్టాన్ని అతిక్రమించినా చట్టపరమైన చర్యలతో పాటు ఇలాంటి వినూత్న శిక్షలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని, మేడిపల్లి పీఎస్ పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అణచివేస్తామని సీఐ గట్టి హెచ్చరించారు.

## కస్తూర్బా విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమైన ప్రజాప్రతినిధులు

**● రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ తదితరులతో కలిసి భోజనం ● విద్యార్థినులకు స్వయంగా వడ్డిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకున్న కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 28:** మహబూబాబాద్ నియోజకవర్గం, కేసముద్రం మండలంలోని కస్తూర్బా బాలికల నూతన కళాశాల, పాఠశాల భవనం, వసతి గృహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ప్రజాప్రతినిధులు వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ శబరీష్, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డా. మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ విద్యార్థినులతో మాట్లాడుతూ వారి చదువు, సౌకర్యాలు, యోగక్షేమాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ విద్యార్థినులకు స్వయంగా భోజనం వడ్డిస్తూ వారితో ఆప్యాయంగా మాట్లాడి, వారి బాగోగులు తెలుసుకున్నారు. విద్యార్థినుల పట్ల చూపిన ఆప్యాయత, వారి సమస్యలు తెలుసుకునేందుకు చూపిన చొరవతో కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## డంపింగ్ యార్డు రద్దయ్యే వరకు పోరాటం

**● సిద్దాపూర్ ఉద్యమానికి ఇన్ముల్ నర్వ గ్రామస్తుల మద్దతు**

**● జీవో 641 రద్దు చేయాలి.. జేఏసీతో కలిసి సాగుతాం**

**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 28:** కొత్తూరు మండలం సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలకు ఇన్ముల్ నర్వ గ్రామస్తులు మద్దతు తెలిపారు. సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ జీవో 641 రద్దయ్యే వరకు జేఏసీతో కలిసి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ మిట్టు నాయక్ మాట్లాడుతూ ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరిగినా పోరాటం మరింత ఉధృతమవుతుందని అన్నారు. మరో మాజీ సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ డంపింగ్ యార్డు రద్దయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్, కో చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య, కో కన్వీనర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad